క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

కడియం: దుళ్లలో అతిపురాతన రుక్మిణీసత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. దాదాపు 93ఏళ్ల క్రితం తోకల వారి వంశీయులు ఈ ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించినట్టు రికార్డులు ద్వారా తెలుస్తోంది. అయితే ధ్వజస్తంభ శిథిలస్థితికి చేరడంతో అదే వంశీయులు ధ్వజస్తంభాన్ని సిద్ధం చేశారు. ఆలయ ప్రధానఅర్చకులు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో పూజలు జరిగాయి. 12మంది రుత్వికులు మూడు రోజుల పాటు ప్రత్యేక హోమాలు పూజలు చేసి ప్రతిష్ఠించారు. గ్రామంలోని యువకులు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని, వైఎస్సార్ సీపీ నేతలు కొత్తపల్లి శివాజీ, తాడాల చక్రవర్తి, కడియం ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

త్రిషాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రకాశం నగర్: త్రిషాల్ రాజ్‌కుమార్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. క్రీడాకారుడు త్రిషాల్ రాజ్‌కుమార్ ఇండోర్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ చాంపియన్ షిప్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో టీం విభాగంలో గోల్డ్ మెడల్, డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్, వ్యక్తిగత విభాగంలో బ్రాంజి మెడల్ సాధించిన సందర్భంగా జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం త్రిషాల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

రంగంపేట: గ్రామ ఇలవేల్పు ఉమారామలింగేశ్వరస్వామి, సంతాన బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, బాలాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఉండవల్లి జానకిరామ సుబ్బారావు, లక్ష్మీసుజాత దంపతులతో విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు హోమాలు చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

కంబాలచెరువు: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్టేడియం రోడ్డు నాగుల చెరువు ప్రాంతానికి చెందిన వేపూరి కిశోర్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనిను వేరే మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉండడాన్ని భార్య ఫోన్‌లో చూసింది. దీంతో ఆమె కిశోర్‌తో గొడవ పడింది. ఈ క్రమంలో కిశోర్ థమ్సప్ బాటిల్ లో పురుగు మందు కలుపుకొని సేవించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిశోర్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: ఈనెల 14వ తేదీన చిత్రాడలో నిర్వహిస్తున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని చీరాలు, పొన్నూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఆళ్ల అనిల్‌కుమార్, పార్వతి నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం హుకుంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు రూరల్ నియోజకవర్గ జనసేన పార్టీ సమావేశానికి వారు హాజరయ్యారు. ఈసందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, కడియం, రూరల్ మండలాల పార్టీల అధ్యక్షుడు ముద్రగడ జెమీ, చప్పాచిన్నారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణగౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: మికీ 17, శివంగి
సూర్యప్యాలెస్	: కింగ్‌స్టన్
స్వామి	: శబ్ధం
శివజ్యోతి	: మజాకా,చావా
అనుశ్రీ	: మజాకా
రాజా	: అగత్యా
ఊర్వశి	: తండేల్
మేనక	: నారి, పౌరుషం
రంభ	: రాక్షస,రారాజా
కుమారి	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	: సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు
అశోక నామవరం	: చావా
విఎస్.మహల్ ధవళేశ్వరం	: చావా
మురళీకృష్ణ కడియం	: చావా
వెంకటసూర్య	: చావా

కరాటేలో పతకాల పోరు

- పలు విభాగాల్లో పతకాలు సాధిస్తున్న విద్యార్థులు
- విజేతలను అభినందించిన కలెక్టర్ ప్రశాంతి



ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రకాశం నగర్: చదువుతో పాటు విద్యార్థులు కరాటేలోను రాణిస్తున్నారు. అత్మరక్షణ కోసం కొందరు, హాబీగా కొందరు విద్యార్థులు కరాటే నేర్చుకుంటున్నారు. వీరిలో క్రీడాకారులు సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెళకువలు నేర్చుకుంటూ, ప్రత్యర్థిని మట్టి కరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేలో తమ ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి పలు పతకాలు పొందుతున్నారు. ప్రసుత్త సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే వంటి శిక్షణాలు వారిలోని అత్మస్థైర్యాన్ని పెంచడంతోపాటు వారికి ఆపదలో ఆదుకునేలా ఉంటాయని శిక్షకులు చెబుతున్నారు. ఐతే మిగిలిన క్రీడాలతో పోలిస్తే కరాటేకు కఠోరమైన శిక్షణ, ఏకగ్రత, క్రమశిక్షణతో కూడుకున్న ఈ విద్యల్లో రాణించడం అంత సులభం కాదని క్రీడా శిక్షకులు చెబుతున్నారు. ముఖ్యంగా బాలురుతో పోలిస్తే బాలికాలు కరాటే మంచి ప్రతిభ కనబరిచి పతాకాలు సాధిస్తున్నారని అంటున్నారు.

పలు పతకాలు కైవసం

ఇటీవల చిలకలూరి పేటలోని వేంకటేశ్వర ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరిగిన జవహార్ లాల్ నెహ్రూ మెమోరియల్ ఆల్ ఇండియా కరాటే -డీ చాంపియన్ షిప్ -2025 పోటీల్లో నగరానికి చెందిన పలు పాఠశాల విద్యార్థులు సత్తా చాటి పలు విభాగాల్లో పతకాలు సాధించారు. వీరిలో అండర్ 10, 12, 14, 17 విభాగాల్లో ఎచ్.సూర్య ఆనీస్ ప్రథమస్థానం సాధించగా, బి.మోక్షిత్, ఎం.అశ్విన్ కుమార్ ద్వితీయ స్థానంలో నిలవగా, కె.చరణ్ కృతి, ఎం.అభి, టీ.శ్రీగణేష్ తృతీయ స్థానంలో నిలిచారు. మొహ్మద్ నూర్, సీహెచ్ లలిత, పి.గుణవీర, శంకర్, సంజయ్, లక్ష్మి సతీష్, ఇమ్మానుయేలు రన్స్‌గా నిలిచారు. అండర్-17 కుమిటే విభాగంలో పి.పూజ ప్రథమ స్థానంలో నిలిచింది.

విద్యార్థులకు అభినందనలు

కరాటే జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కలెక్టర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేసి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని అకాంక్షించారు. కరాటే మాస్టర్ పి.అరుణ్ కుమార్‌తో పాటు కోచ్ పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి పెరిగి ..



గతంతో పోలిస్తే ఇప్పుడు క్రీడాలపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. ఆయా పోటీల్లో బాలురుతో పోలిస్తే బాలికాలు మంచి ప్రతిభ కనబరిచి పతకాలు కైవసం చేసుకుంటున్నారు. క్రీడా పోటీల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుంది. పిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే మంచి విజయాలు సాధించే అవకాశం ఉంటుంది.

– ఎస్ఆర్‌కేవీ స్వామి,
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి

కొరవడిన ప్రభుత్వ సహాయం

క్రీడాల్లో విద్యార్థులు రాణించి, పలు విభాగాల్లో పతకాలు సాధించినప్పటికి వారికి తగ్గిన శిక్షణ, ప్రోత్సాహం అందించంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పలువురు సీనియర్ క్రీడాకారులు పెదవి విరుస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడాకారులకు స్కూల్స్ గేమ్స్‌తో పాటు ఆడుదాం ఆంధ్ర వంటి పోటీలను నిర్వహించి గ్రామీణా స్థాయిలో ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలకితీసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందించి వారికి ఆర్థికంగా చేయూత నిచ్చింది.

వంగవీటి రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి



రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సమతారాము

కడియం: వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు కాపు యువత కృషి చేయాలని కాపు రాయలసీమ, కాపు జేఏసీ కన్వీనర్ సమతా రాము పిలుపునిచ్చారు. ఆదివారం కడియపులంక గ్రామంలో కాపు జేఏసీ నాయకులు జేటీ రామారావు ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాపులను బీసీల్లో చేర్చేందుకు కాపు యువత అంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, రాష్ట్ర జేఏసీ కన్వీనర్, వైఎస్సార్ సీపీ వికలాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, వివిధ జిల్లాల జేఏసీ నాయకులు తిరుమల శెట్టి మురళి శ్రీనివాస్ పాలమర్తి ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సఖితో మహిళా సాధికారత



బుర్రకథ కళాకారులతో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, సెంట్రల్ జైలు మెడికల్ సూపరింటెండెంట్ కోమల

సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి

రాజమహేంద్రవరం రూరల్: ప్రధాని నరేంద్రమోదీ బీమా సఖి పేరుతో మహిళా ఏజెంట్స్‌కు పెద్ద ఎత్తున ఉపాధికల్పన చేశారని, మహిళలు ఆర్థిక, సామాజిక సాధికారిత సాధించవచ్చని రాజమండ్రి ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. స్థానిక జేకే గార్డెన్స్‌లో శనివారం రాత్రి జీవిత బీమాసంస్థ, రాజమండ్రి డివిజన్ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి మాట్లాడుతూ రాజమండ్రి డివిజన్ పరిధిలో బీమాసఖి పేరుతో వందలలో మహిళా బీమా ఏజెంట్స్‌ను నియమించడం ఒక మహిళగా గర్విహిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెంట్రల్ జైలు మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.కోమల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలంటే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, అందుకు పోషకాహారం తీసుకోవాలన్నారు. మహిళలు లేని రంగం లేదని, అంతరిక్షం నుంచి అగాధ సముద్రం వరకు నేటి మహిళలు రానిస్తున్నారన్నారు. మహిళా ఏజెంట్లకు డా.కోమల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి మహిళా బీమా సఖి ఏజెంట్సులందరికీ కిరీటం ధరించి, దుశ్శాలువతో సత్కరించారు. ముందుగా ఒక ప్రత్యేక బుర్ర కథ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, బ్రాంచి, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాకేత్ గాత్రం



గాత్రకచేరి చేస్తున్న సాకేత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చెన్నయ్‌కు చెందిన సాకేత్ రామ్ గాత్ర కచేరి సంగీత ప్రియులను అలరించింది. శ్రీత్యాగరాజ నారాయణ దాస సేవాసమితి లో జరుగుతున్న 74వ సంగీత వార్షికోత్సవాలు లో భాగంగా ఆదివారం జరిగిన సాకేత్ గాత్రానికి విశాఖ పట్టణానికి చెందిన ఎంఎస్ఎన్ మూర్తికి వయోలిన్, వంకాయల వెంకట రమణ మూర్తి మృదంగం, గుంటూరుకు చెందిన కె.హరి బాబు ఘటం సహకారాలను అందించారు. ప్రముఖ న్యాయవాదులు మద్దూరి శివ.సుబ్బారావు, మద్దూరి శివరామ శశి భూషణ్‌లు ఈ కార్యక్రమానికి చేయూత నిచ్చారు. కార్యవర్గ సభ్యులు,పెద్ద సంఖ్యలో సంగీతాభిమానులు హాజరయ్యారు.

నేడు కూచిపూడి నృత్యం

సోమవారం సాయంత్రం ప్రముఖ కూచిపూడి కళాకారుడు పసుమర్తి కుమార దత్త, ఆయన బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహిస్తారు.

క్రికెట్ లీగ్ టోర్నీ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం హుకుంపేట డిమార్టు పక్కన మైదానంలో టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగ ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో గోరంట్ల ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను డా.రవిరామ్‌కిరణ్ బ్యాటింగ్ చేసి ప్రారంభించి,అనంతరం హుకుంపేట,బొమ్మూరు క్రికెట్ జట్లకు టాస్ వేసి, క్రీడాకారులను ఆయన అభినందించారు.

ఒక చిత్రం వెయ్యి పదాల భావంతో సమానం

- చిన్నారులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం
- డీఐ దిలీప్ కుమార్
- విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



గీసిన చిత్రాలతో చిన్నారులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఐ దిలీప్‌కుమార్ తదితరులు


ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్ కాంపిటిషన్ దోహద పడుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్‌కుమార్ అన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన బాలోత్సవం నిర్వాహకులకు చిన్నారులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. గోదావరి బాలోత్సవం- మనం ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో దానవాయి పేట మున్సిపల్ హైస్కూల్లో ఆదివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం, దామెర్ల రామారావు 128వ జయంతి సందర్భంగా డ్రాయింగ్ కాంపిటిషన్ నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ లెవెల్‌లో స్కూల్, కాలేజీ స్థాయి విద్యార్థులు, మహిళలు, పురుషులు జిల్లా నలుమూలల నుంచి దాదాపు వెయ్యి మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.తులసి, మనం ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి నవీన కుమారి అధ్యక్షత వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, దామెర్ల రామారావు 128వ జయంతి పురస్కరించుకుని డ్రాయింగ్ కాంపిటిషన్ నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ క్రియ పిల్లల పండుగ కాకినాడలో గతంలో నిర్వహించేవారని గుర్తుచేశారు. అదే స్థాయిలో గత రెండేళ్లుగా చిన్నారులలో సజనాత్మకతను వెలికితీసేందుకు గోదావరి బాలోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రస్తుత కాలానుగుణంగా సెల్ ఫోన్ వినియోగం పెరిగిందని అయితే చిన్నారులు సైతం ఫోన్లతోనే ఎక్కువ సమయం గడుపుతున్నారని తెలిపారు. నూతన సాంకేతికతను విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని అన్నారు. ఈ పోటీలలో విజేతలైన వారికి అభినందనలు తెలుపుతూ పాల్గొన్న వారందరికీ విజయానికి ఇది ఒక తొలిమెట్టులా భావించాలని అన్నారు. దామెర్ల రామారావు మనవరాలు దామెర్ల ప్రేమ మాట్లాడుతూ ఒక బొమ్మ వెయి భావాలను పలికిస్తుందని గుర్తు చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరిస్తూ బొమ్మల ద్వారా కమ్యూనికేషన్స్ వ్యక్తపర్చవచ్చని తెలిపారు. గోదావరి బాలోత్సవం- మనం ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మనం ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజైనప్పటికీ పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బుర్రకథ, ఆంధ్ర నాట్యం, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులకు డీఐ డిలీప్ కుమార్, దామెర్ల ప్రేమ జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం నిర్వాహణలో అద్దంకి రాజయోనా, రాజకుమార్, శ్రీనివాస్, కిషోర్, గాయత్రి, లక్ష్మి, ప్రియాంక జడ్జి లుగా వ్యవహారించారు. బాలోత్సవం నాయకులు ఆనంద్, కుసుమ, మెడిద నాగేశ్వరావు, సురేష్, భాస్కర్, రాజేష్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో వెల్‌బేబి కాంటెస్ట్

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సంకర ఫౌండేషన్ కార్యాలయం ఆధ్వర్యంలో వినయ్ విద్యా విహార్ స్కూల్‌లో ఆదివారం ఆరేళ్లలోపు బాలబాలికలకు వెల్ బేబి పోటీలు జరిగాయి. 80 మంది బాలలు ఈ పోటీలలో పాల్గొనగా, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నూకరత్నం, డాక్టర్ శ్రీజ, డాక్టర్ హేమానలిని, ప్రాణిక్ హీలింగ్‌రాజ్యలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే కిర్లంపూడి మండలం, బూరుగుపూడిలో నిర్వహించిన మగ్గం వర్కు ఉచిత శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

నరసన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

- పుట్టమన్ను సేకరణతో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు మొదలు
- స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- ఉత్సవాల కరపత్రంలో పొరపాట్లు
- సదుపాయాల లోపం
- అసంతృప్తిలో భక్తులు



కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చక బృందం



పుట్టమన్నును తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు

మధురపూడి: చారిత్రక నేపథ్యంతోపాటు, పవిత్రతకు నిలయమైన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితులు, భక్తులు పుట్టమన్ను సేరించడంతో ఈ ఉత్సవాలను మొదలుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అయితే ఈ ఉత్సవాలకు సరైన ఏర్పాట్లు చేయలేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక దేవస్థానం రోడ్డు ప్రారంభంలో ఉన్న స్వామివారి ఆర్చికు రంగులు వేయలేదు. స్థానిక బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల సదుపాయాన్ని కల్పించలేదు. సోమవారం రథోత్సవం జరగాల్సి ఉండగా, రథం రోడ్డును నీటితో తడపలేదు. ఉత్సవాలు సందర్భంగా అన్నవరం దేవస్థానం అధికారులు ప్రచురించిన కరపత్రంలో తప్పులు దొర్లాయి. ఈనెల 15వ తేదీన కొండపైన దేవాల యంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ దైవ దర్శనాలు ఉండవని, ఏక కాలార్చన మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కానీ ఉత్సవాల సందర్భంలో త్రికాలర్చన జరుగుతోందన్న విషయాన్ని మరిచారు. అలాగే మండలంలోని ప్రముఖులు, స్వామివారి దేవస్థానానికి చందాలిచ్చిన దాతలు, ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు ఇవ్వలేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. రథోత్సవం సందర్భంలో ప్రమాదాలు జరగడానికి కారణమైన సమస్యను అపరిష్కృతంగానే ఉంది. గానుకవీధి శివారు, అంకాలమ్మవారి ఆలయం సమీపంలో అనుమతులు లేకుండా, జరిగిన భవన నిర్మాణాన్ని చక్కదిద్దడంలో అశ్రద్ధ వహించారు.

వాహనాల మళ్లింపు



జరగాల్సిన రథోత్సవంలో జాగ్రత్తలను వివరిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులు వాహనాలను మళ్లించారు. భక్తుల సౌకార్యర్థం ప్రత్యేక చర్యలు చేపట్టారు. గోకవరం, రాజమహేంద్ర వరం వెళ్లే వాహనాలన్నీ శ్రీరంగపట్నం నుంచి మునగాల వైపునకు మళ్లించారు. వాహనాలు మునగాల, కాపవరం నుంచి రాజమహేంద్రవరం వెళతాయి. కోరుకొండ మీదుగా కోటికేశవరం, నాగంపల్లి, గరగలంపాలెం తదితర గ్రామాలకు వెళ్లే వాహనాలను తీర్థం కారణంగా మళ్లించారు. అలాగే స్వామివారి దేవస్థానం చుట్టూ ఉన్న ప్రాంతాలు, రథం తిరిగే ప్రాంతాలకు రాకపోకలను నిలిపివేశారు. దీంతో పల్లపు వీధి, సాంబశివరావుకాలనీ, అలహా శింగారావుపేట, అంకా లమ్మగుడి రోడ్డు, నవతాట్రాన్స్ పోర్టు రోడ్లకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఉత్సవాలకొచ్చే భక్తులు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలపాలని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ ఆదేశించారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సైలు శ్యామ్‌సుందర్, గోకవరం, సీతానగరం ఎస్సైలు ఉన్నారు.

ఉత్సవాలిలా

స్వామివారి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన ఆదివారం స్వామివారి కోనేరు వద్ద నుంచి పుట్టమన్ను సేకరించి అంకురార్పణ, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో అన్నవరం దేవస్థానం వీర్ల సుబ్బారావు, ఆలయ ధర్మకర్త పరాసర రంగరాజబట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు, దేవస్థానం అర్చక స్వామి చంటిబాబు, అర్చక బృందం పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు దత్తత దేవస్థానమైన అన్నవరం శ్రీవీరవెంకటసత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం 1.56గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ రథోత్సవం స్వామివారి దేవస్థానం నుంచి రెడ్డి పంతులు సత్రం, పాత సంత మార్కెట్, దేవస్థానం రోడ్డు గుండా గానుకవీధి, అంకాలమ్మవారి దేవాలయం నుంచి స్వామివారి దేవస్థానానికి చేరుకుంటుంది. వైఖానస ఆగమ, శ్రీవైష్ణవ సాంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణం రాత్రి 9 గంటలకు వైభవంగా జరగనుంది.